మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ

## రైస్ మిల్లర్లకు ఇచ్చిన ధాన్యాన్ని సకాలంలో అందించాలి : అదనపు కలెక్టర్

**గద్వాల డిసెంబరు 20 ప్రభాతవార్త :** రైస్ మిల్లర్లకు ఇచ్చిన ధాన్యాన్ని సకాలంలో అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ నందు రైస్ మిల్లర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ 2022-23 సంబంధించిన ధాన్యాన్ని వేలం దార్లకు కి అప్పగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర నుండి ఫిలిప్పైన్స్ కు ఎగుమతి చేయబడే ధాన్యం ను వేలం వేసిన ధాన్యం నుండి 5 నూకతో బియ్యం ని సివిల్ సప్లై శాఖకు అందజేయాలని అన్నారు. ఖరీఫ్ 2024-25 కు సంబంధించిన సిఎంఆర్ ను వెంటనే డెలివరీ చేయాలి. ఖరీఫ్ 2024-25 కు మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారెంటీ గడువు పూర్తి అయినందున ఇప్పటికీ ఇవ్వనివారు త్వరగా అందజేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్ఓ స్వామి కుమార్, జిల్లా మేనేజర్ విమల, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేసులు పారదర్శకంగా విచారించాలి : ఎస్పీ జానకి




మాట్లాడుతున్న ఎస్పీ జానకి
ఇన్‌సెట్లో హాజరైన అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 20 ప్రభాత వార్త :** కేసులలో పారదర్శకంగా, పకడ్బందీగా విచారణ చేపట్టాలి, కేసులలో నిందితులకు పడే శిక్ష శాతాన్ని పెంచాలని ఎస్పీ జానకి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ హాల్లో సర్కిల్ వారిగా పోలీస్ అధి కారుల తో జిల్లా ఎస్పీ నెలవారి నేర సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ అధికారులు వ్యవస్థీకృత నేరాలపై దృష్టి పెట్టాలని, నమోదు అయిన ప్రతి కేసులో పారదర్శకమైన లోతైన విచారణ చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌ల వారిగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలను పరిశీలించారు. కేసులను చేదించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలను, నమోదైన పోక్సో కేసు వివరాలను పరిశీలించి ఆయా కేసుల లో శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీస్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కంటెస్టెడ్ కేసులు కోర్టు ట్రయల్స్ నడిచే సమయంలో సాక్షులను పకడ్బందీగా బ్రీఫ్ చేస్తు ఎప్పటికప్పుడు కేసులకు సంబందించిన విషయాలను బాధితులకు అప్డేట్ చేస్తూ కేసులలో నిందితులకు పడే శిక్షల శాతాన్ని మరింత పెంచాలని సూచించారు. అలాగే మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలు అయిన పోక్సో కేసులలో కూడా నిందితులకు పడే శిక్షల శాతాన్ని పెంచేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల కేసులను చేదించడం లో పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అందుకు తగిన ప్రణాళిక రచించి ముందుకెళ్లాలని ఆదేశించారు. దొంగతనాల కేసులలో నిందితులను లోతుగా విచారించాలని, వీలైనంత త్వరగా అయా కేసులను చేదించాలని ఆదేశించారు. నీలిలి రిపోర్ట్స్, అరెస్ట్ లు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజావాణి లో వచ్చిన పిర్యాదులు పై వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డిఎస్‌పి జివి రమణ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, సిఐ, ఇన్స్పెక్టర్స్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే త్వరగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్



ఇళ్ల సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలని, సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఉదయం వనపర్తిలోని బసవన్నగడ్డ, వనపర్తి శివారు రాజానగరం వడ్డెగేరిలో జరుగుచున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 25 ఇళ్ళు పూర్తి చేయాలని ఆన్లైన్‌లో డేటా నింపేటప్పుడు తప్పులు చేయవద్దని సిబ్బందిని సూచించారు. సర్వే చేసేటప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు తప్పులు ఉంటే సరిచేయాలని చెప్పారు. యాప్‌లో ఏమైనా సాంకేతికసమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజనగరం శివారులోని అమ్మ చెరువును పరిశీలించారు. చెరువు కట్టపై ఏర్పాటుచేసిన లైట్లు వినియోగంలో ఉన్నాయా అని మున్సిపల్ కమీషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కట్టపై క్లీనింగ్ చేయడంతో పాటు, ఉన్న ఖాళీ స్థలంలో ప్లాంటేషన్ చేయించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు.

**ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ ..** వడ్డెగేరిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయానికి హాజరవుతున్నారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకుగాను ఒకరే హాజరు ఉన్నారు. దీంతో ఉపాధ్యాయుల గత నెల రోజుల జియో టాగింగ్ అటెండెన్స్ వివరాలు ఇవ్వాలని ఎంఈఓకు చెప్పారు. పాఠశాలలో విధులకు హాజరు కాని ప్రధానోపాధ్యాయుడికి షోకాస్ నోటీసు జారీ చేయాలని ఎంఈఓకు ఆదేశించారు. నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ,తహశీల్దార్, ఇతర అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అంగన్‌వాడీలపై పర్యవేక్షణ పెంచాలి

పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా అంగన్‌వాడీలు
విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలి
తనిఖీల్లో లైవ్ లొకేషన్ ఫొటోస్ అప్లోడ్ చేయాలి
సమీక్షలో కలెక్టర్ విజయేంద్ర బోయి



హాజరైన అంగన్వాడీలు, సూపర్వైజర్లు




మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 20, ప్రభాతవార్త:** అంగన్వాడీ, పూర్వ ప్రాథమిక పాఠశాలలు సక్రమంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్‌లు పర్యవేక్షణ నిర్వహించాలని సూపర్‌వైజర్‌లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓలు, సూపర్‌వైజర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంగన్‌వాడి కేంద్రాలను ప్రభుత్వం పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చినందున అంగన్ వాడి పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఆట, పాటలతో కూడిన విద్య, పౌష్టిక ఆహారం అందించాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ, పూర్వ ప్రాథమిక పాఠశాలలలో మండలం వారిగా సెక్టార్లలో పని చేస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ, పూర్వ ప్రాథమిక పాఠశాలలలో ఏ మండలంలో పని చేస్తున్న సెక్టార్‌ల పరిధిలో పని చేస్తున్న వారిని ఆయా మండలాల పరిధిలోని సెక్టార్‌లలో పని చేసేలా హేతుబద్ధీకరణ చేయాలని సూచించారు. అంగన్వాడీ, పూర్వ ప్రాథమిక పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించడంలో అలసత్వం వహించడం పట్ల సిడిపిఓలను సూపర్ వైజర్‌లను కలెక్టర్ హెచ్చరించారు. బరువు తక్కువ ఉన్న 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి ఎన్ఆర్‌సి సెంటర్‌కు పంపించాలని, సాధారణ బరువు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూపర్వైజర్‌లు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసే సమయంలో లోకేషన్‌తో వచ్చే ఫోటోలను ఆప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఫీల్డ్‌లో ఒక్క సూపర్వైజర్ కూడా ఎక్కడ కనిపించడం లేదని, గర్భిణుల ఇంటికి వెళ్లి వారి గురించి అడిగి తెలుసుకోవాలని. ఆప్‌లో ఎప్పటికప్పుడు డేటా అప్లోడ్ చేయాలని సూచించారు అంగన్వాడీలో ఫ్యాన్లు, లైట్లు, టైమ్ టేబుల్, టాయిలెట్స్, పిల్లలకు యూనిఫాం వంటివి ఏర్పాటు చేయాలని, మండలానికి ఒక మోడల్ సెంటర్‌గా ఏర్పాటు చేయాలని అన్నారు. అంగన్‌వాడీ, పూర్వ ప్రాథమిక పాఠశాలలో స్థలం ఉన్నచోట న్యూట్రీ గార్డెన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల శివేంద్రప్రతాప్, మహిళా, శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల శాఖ సంక్షేమ శాఖ అధికారిణి జరీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి

### వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్




రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్‌పి

**పాన్‌గల్ డిసెంబరు 20 ప్రభాతవార్త :** పోలీసు సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు శుక్రవారం "వార్షిక తనిఖీలలో "భాగంగా పానుగల్ పోలీస్టేషన్ ను ఆయన సందర్శించారు. ఎస్పీకి ముందుగా వనపర్తి సీఐ, క్రిష్ణ, పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీసుల చేత గౌరవ వందనం స్వీకరించి, పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. స్టేషన్లో రికార్డ్స్ ను, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్టేషన్ రిసెప్షన్, లాకప్ ,మెన్ బ్యారెక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. పోలీస్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలపై ఆరా తీశారు. ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు వివరాలు, నేరస్థుల ప్రస్తుత పరిస్థితుల పై తదితర వివరాలను పెండింగ్ లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను పానుగల్ ఎస్సై, శ్రీనివాసులు ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... విధుల పట్ల అంకితభావం ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు, పానుగల్ పట్టణంలో అనుమానిత వ్యక్తులు ఎప్పుడు కనిపించినా వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ మార్గంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాల నివారించడానికి కృషి చేయాలని తెలిపారు. ఆర్థిక నేరాలకు కట్టడి చేయడానికి సీసీ టీవీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలకు చైతన్య పరచాలని పేర్కొన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఆయా పోలీస్ స్టేషన్ ల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేలా చూడాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామాలలో పట్టణాలలో ప్రజలకు ప్రజాప్రతినిధులకు యువకులకు గ్రామాల గ్రామ పోలీస్ అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తరుచూ వాహనాల తనిఖీ వంటి స్పెషల్ డ్రైవ్స్ చేపట్టి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని ఆయన అన్నారు.

పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ... విధి నిర్వహణలో నిబద్దతతో ఉండాలని తమకు కేటాయించిన విధిని సక్రమంగా నిర్వహించినప్పుడే అధికారుల మన్ననలు పొందుతారని, చేసిన పనికి గుర్తింపు లభిస్తుందన్నారు. పోలీస్ కానిస్టేబుల్ వర్మను విధుల పట్ల వ్యవహరించిన పనితీరు పట్ల అభినందించి రివార్డును ప్రకటించారు. అలాగే జిల్లాలోని మొట్టమొదటి నిగా కెమెరాలు ఏర్పాటు చేసిన ఘనత పానగల్ ఎస్సై శ్రీనివాసులు దక్కిందని ఈ సందర్భంగా ఎస్సై శ్రీను అభినందించారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో వనపర్తి సీఐ ,క్రిష్ణ ,పానుగల్ ఎస్సై, శ్రీనివాసులు, శిక్షణ ఎస్సై, దివ్యారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పి

## యుటిఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి




గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జడ్పీ సీఈవో, యూటీఎఫ్ నాయకులు

### గోడపత్రికలను ఆవిష్కరించిన జడ్పీ సీఈవో వెంకటరెడ్డి

**మహబూబ్‌నగర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర ఆరవ విద్యావైజ్ఞానిక మహాసభల గోడపత్రికలను జిల్లాపరిషత్ ముఖ్య కార్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) వెంకటరెడ్డి టీఎస్ యుటిఎఫ్ నాయకులతో కలిసి జడ్పీకార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లాఅధ్యక్షుడు కే. రవి కుమార్, ప్రధానకార్యదర్శి ఎన్ వెంకటేష్ మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక మహాసభలు నల్లగొండలో డిసెంబర్ 28,29,30 తేదీలలో జరుగుతున్నాయని ఇట్టి మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో ప్రభుత్వవిద్యారంగంపై మేధావులతో లోతైన చర్చ జరుపబోతున్నామని తెలిపారు. ఈ మహాసభలకు మొదటిరోజు 28న ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్రశాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే జంగయ్య, చావరవి, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్, ఆంధ్ర జ్యోతి పూర్వ సంపాదకులు డాక్టర్ కే శ్రీనివాస్, కుమారి అయిషీ గోష్‌లు వివిధఅంశాలపై విద్యా సదస్సులో ప్రసంగిస్తారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్ కిష్టయ్య జిల్లా ఉపాధ్యక్షులు పి ఉమాదేవి, జిల్లా కోశాధికారి వి. భాస్కర్ జిల్లాకార్యదర్శులు డి. అజయ్, హేమంత్‌కుమార్, శివరాజ్, ఖాదరయ్య, జయంతి, అర్చన, జిల్లానాయకులు హేమలత, కనకమ్మ, వివిధ మండలాల బాధ్యులు శంకర్‌నాయక్, చంద్రయ్య, కథలయ్య, రాములు, అయూబ్, కన్నయ్య, ఎం శ్రీనివాస్, డబ్ల్యూ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు





**చిన్నచింతకుంట, డిసెంబరు 20 ప్రభాతవార్త:** జిల్లాకేంద్రంలో జరిగిన సీఎం కప్ క్రీడాపోటీల్లో మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన క్రీడా కారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కబడ్డీ పోటీల్లో నవీన్, లక్ష్మణ్, అథ్లెటిక్ లాంగ్‌జంప్‌లో నిఖిల్, అథ్లెటిక్ 600మీటర్ల రన్నింగ్‌లో పావని చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను కురుమూర్తి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో చక్కటి ప్రతిభను కనబరిచి మెడల్ సాధించాలని గ్రామస్తులు కోరారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు చేయాలి

### బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి డిమాండ్

**దేవరకద్ర, డిసెంబరు20 ప్రభాతవార్త:** కొత్తగా ఏర్పాటు అయినా దేవరకద్ర మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.50కోట్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని దేవరకద్ర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీకి గత 2 సంవత్సరాల క్రితమే బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. అప్పట్లో అసెంబ్లీ ఎన్నికలకోడ్ రావడంతో అట్టి ఫైల్ పెండింగ్‌లో ఉండి పోయిందన్నారు. అయితే గతంలో కూడా దేవరకద్ర నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భూత్పూర్, కొత్తకోట పట్టణాలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క మున్సిపాలిటీకి రూ. 20 కోట్లు నిధు లు కేటాయించిందన్నారు. అలాగే దేవరకద్ర మున్సిపాలిటీ అభివృద్ధికి కూడా అత్యధికంగా నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన 12 మున్సిపాలిటీల జాబితాలో దేవరకద్ర కూడా ఉండడంతో జెట్టి నరసింహారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్



హాజరైన అధికారులు

**నారాయణపేట టౌన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శాఖల వారీగా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆస్పిరేషన్ నర్వ బ్లాక్ పై జిల్లా అధికారులు, నర్వ మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈనెల 26న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నర్వ మండలంలోని రాయికోడ్, పాతర్ చేడ్ గ్రామాలలో పర్యటించనున్నారని, ఆయా గ్రామాలతో పాటు, నర్వ మండలంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి ఎంత మేర చేకూరిందనే వివరాల నివేదికను అధికారులు శాఖల వారీగా సిద్ధం చేసుకుని ఉండాలని, పూర్తిస్థాయి రిపోర్ట్‌ను శనివారం 11 గం.ల వరకు తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్పిరేషన్ నర్వ బ్లాక్‌లో 12 ప్రభుత్వ శాఖల అధికారులు 40 ఇండికేటర్ల వారీగా సమగ్ర వివరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కేంద్ర నిధుల వినియోగంపై మంత్రి బండి సంజయ్ ఆరా తీసే అవకాశం ఉందని, కేంద్రం నిధులు ఎన్ని? రాష్ట్ర నిధులు ఎన్ని? ఎక్కడ పనులు నిలిచిపోయాయని ప్రశ్నించే ఆస్కారం కూడా ఉందని తెలిపారు. అధికారులు అన్ని వివరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ఇదివరకు ములుగు, భూపాలపల్లి జిల్లాలో పర్యటించారని, అక్కడి అధికారులతో మాట్లాడితే కొంత క్లారిటీ వస్తుందని సూచించారు. మంత్రి బండి సంజయ్ పర్యటన ముగిసే వరకు ఈ నెల 26 వరకు అధికారులెవ్వరికి సెలవులు లేవని కలెక్టర్ స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం రాయికోడ్ పల్లె దవాఖానను పరిశీలించిన సమయంలో రికార్డులన్నీ సక్రమంగా రాయలేదని దానికి బాధ్యులు ఎవరని కలెక్టర్ వైద్యశాఖ అధికారులను నిలదీశారు. మంత్రి పర్యటనలో ఆరోగ్యశాఖ ఇండికేటర్ ప్రధానంగా ఉందని, క్షేత్రస్థాయిలో పరిస్థితి బాలేకపోతే ఎలాగని ప్రశ్నించారు. కలెక్టరే అన్ని చోట్లకు వెళ్లి తనిఖీలు, పరిశీలనలు జరిపితే ఇక జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు ఎందుకు ఉన్నట్లు అని ఆమె అసహనం వ్యక్తం చేశారు. పనిచేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోవాలని సున్నితంగా హెచ్చరించారు. విద్యాశాఖ పనితీరు కూడా సంతృప్తికరంగా లేదని, సమీక్షకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎందుకు రాలేదని ఆమె ప్రశ్నించారు. డీఈవో సెలవు పై వెళ్లారని విద్యాశాఖ ఉద్యోగి ఒకరు తెలపడంతో సెలవు పత్రం ఎవరికి ఇచ్చారని, తాను సెలవు ఇవ్వనిదే ఎలా వెళ్తారని ప్రశ్నించారు. నర్వ ఎంఈఓ కూడా రాయికోడ్ కు రాలేదని, నేటి సమీక్షకు హాజరు కాకపోవడంపై సంజాయిషీ కోరారు. డిసెంబర్ నెల వచ్చినా ఇంకా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. విద్యాశాఖ డిఆర్డిఏ అధికారులు సమన్వయం చేసుకుని పంపిణీని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నర్వ మండలంలోని పంచాయతీల వారీగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల నివేదికను తయారు చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ పథకం బిల్లుల పెండింగ్ గురించి, పీఎం కిసాన్ యోజన, మట్టి నమూనాల సేకరణ వివరాలను పద శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ, సంక్షేమ, ప్రణాళిక శాఖల అధికారులు సమగ్ర వివరాలతో కూడిన రిపోర్ట్ లను సమర్పించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాయికోడ్, పాతర్ చేడ్ గ్రామాలలో పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుద్ధ చర్యలు మెరుగుపరచాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు సూచించారు. అధికారులందరూ నిబద్ధత, సమన్వయంతో కలిసి పని చేస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పునరుద్ఘాటించారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ గరిమానరుల, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, డిఆర్‌డిఓ మొగులప్ప, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, పీఆర్ఈఈ హిర్యా నాయక్, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, డిడబ్ల్యుఓ జయ, జిల్లా ఆస్పత్రి సమన్వయకర్త డా. మల్లికార్జున్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మమ్మద్ ఖలీల్, సివిల్ సప్లై అధికారి సుదర్శన్, నర్వ తహసిల్దార్ మల్లారెడ్డితో పాటు నర్వ మండలానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి

### సిపిఎం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బర్


సభలో మాట్లాడుతున్న ఎండి జబ్బర్

**అమరచింత డిసెంబరు20 ప్రభాతవార్త:** పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీడీ కార్మిక నేత కామ్రేడ్ జి శ్రీనివాస్ 26వ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామ్రేడ్ జి శ్రీనివాస్ బీడీ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని అనేక ఏళ్లుగా పోరాటం చేసి కార్మికులకు వేతనాలు పెంచడంలో ముందుండి పోరాడిన వ్యక్తి అని ఆయన అన్నారు. వ్యవసాయ కూలీలకు బీడీ కార్మికుల కూలీల పెంపు కోసం భూస్వాములకు బీడీ యజమానులకు వ్యతిరేకంగా పోరాడి వేతనాలు పెంచిన ఘనత కామ్రేడ్ జి శ్రీనివాస్ అని అన్నారు.కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం కార్యకర్తలు కామ్రేడ్ జి శ్రీనివాస్ ను ఆదర్శంగా తీసుకొని పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జీఎస్ గోపి,బి వెంకటేష్, ఆర్ఎన్ రమేష్ ,అజయ్,బుచ్చన్న ,శ్యాంసుందర్ ,రాఘవేంద్ర ,కాకి శ్రీను,చెక్కెం విష్ణు ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సైక్లింగ్‌తో కండరాలు పటిష్టం

**మక్తల్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం ద్వారా మానవ శరీరంలోని కండరాలు పటిష్టంగా తయారవుతాయని మక్తల్ సీఐ జి. చంద్రశేఖర్, తహశీల్దార్ సతీష్ కుమార్ అన్నారు. నారాయణపేట జిల్లా సీఎం కప్ సైక్లింగ్ పోటీలను శుక్రవారం పట్టణంలోని కర్ని రోడ్డులో వారు జెండా ఊపి ప్రారంభించారు. బాలికలకు ఐదు కిలోమీటర్లు, బాలురు, సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలకు 10 కిలోమీటర్ల మేర సైక్లింగ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 27 నుంచి 29 వరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని డివైఎస్ఓ వెంకటేష్‌శెట్టి, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుండి 300 మంది బాల బాలికలు పాల్గొన్నారు. క్రీడాకారులకు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం హెల్మెట్స్, టీ షర్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిటిసి కోళ్ల వెంకటేష్, పీడీలు విష్ణువర్ధన్, నరేష్, ఈశ్వర్, దామోదర్, రమేష్ కుమార్, అమ్రేష్, రాకేష్, మీనా కుమారి, రాజేశ్వరి, శ్రీవాణి, రేణుక, బి.దీప, పుష్పలత, స్వరూప, సౌమ్య, లత, విద్యాసాగర్, ఆంజనేయులు, లియాకత్ అలీ, నవనీత, డాక్టర్ వెంకటరమణ, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి

### అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**పెబ్బేరు డిసెంబరు 20 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.శుక్రవారం పెబ్బేరు మండల పరిధిలోని పెబ్బేరు మార్కెట్ యార్డు, కంచిరావు పల్లి ఐ.కే.పి, సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు.ధాన్యం సేకరణ నిబంధనల ప్రకారం జరగాలని,తేమ,తాలు,చెత్త లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను సూచించారు. సేకరించిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని అదేవిధంగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అకస్మాత్తుగా వచ్చే వర్షాల నుండి ధాన్యానికి రక్షణ కల్పించే విధంగా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

## మక్తల్ పడమటి అంజన్న సన్నిధిలో శాంతి కుమార్


అంజన్నను దర్శించుకుంటున్న బండారి శాంతికుమార్

**మక్తల్ టౌన్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పెద్ద మొత్తంలో సర్పంచ్‌లను గెలిపించుకొని జిల్లాలో సత్త చాటాలని బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ తెలియజేశారు. శుక్రవారం మధ్యాహ్నం మక్తల్ పడమటి ఆంజనేయస్వామి తిరుణాల ఉత్సవాల సందర్భంగాపూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి ప్రాణేషాచారి శాలువాలతో సన్మానించారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని స్థానిక ఎన్నికలగెలుపులో స్థానికనాయకుల పనితీరు నిదర్శనమని తెలిపారు.బూతు స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేయడంలో ప్రత్యేక శ్రద్ధతీసుకొని పార్టీలోని కార్యకర్తలు నాయకులు అందరూ కలిసికట్టుగా అభ్యర్థుల విజయానికి కృషిచేసి అత్యధిక పంచాయతీ సర్పంచులు గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా అసెంబ్లీ ఇన్చార్జి రతంగ్ పాండురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్య,రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్ మయూరినాథ్, భాస్కర్, మక్తల్ కౌన్సిలర్ రామ్‌మాధవ్, పూలశీను,మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న దృశ్యం

**అమరచింత డిసెంబరు 20 ప్రభాతవార్త :** పార్లమెంటులో బిజెపి ఎంపీలపై అగ్రనేత రాహుల్ గాంధీ దాడి చేయడాన్ని నిరసిస్తూ బీజేవైఎంఆధ్వర్యంలో శుక్రవారం అమరచింత మండలకేంద్రంలోని బస్టాండ్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈసందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికారప్రతినిధి, మెరువ రాజు మాట్లాడుతూ, పార్లమెంటులో బిజెపి ఎంపీల క్రమశిక్షణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిజెపి ఎంపీలపై దాడి చేయడం సభ్య సమాజానికి సిగ్గుచేటన్నారు. బిజెపి ఎంపీలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో బిజెపి పాలనలో ప్రజలు స్వేచ్ఛ జీవనం కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఓర్వ లేక బిజెపిపై అసత్య ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో మంత్రి సుధీర్ ,కదిరే మధు ,మనోహర్ గౌడ్ ,రాజశేఖర్ యాదవ్ ,హరి ,అశోక్ ,నంద అశోక్ ,గోపాల్ ,సందీప్ ,ప్రశాంత్ ,నాని రవికుమార్,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ బాక్సింగ్ పోటీలలో వెండి పథకం


వెండి పథకం అందుకుంటున్న విద్యార్థి

**కొత్తకోట డిసెంబరు 20 ప్రభాతవార్త :** ఈ నెల 19 తేదీ మహబూబ్‌నగర్ లోని మినీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ బాక్సింగ్ ఈవెంట్లో అండర్ 14 సంవత్సరాల 48 కేజీల విభాగంలో కొత్తకోటకు చెందిన ఎస్కే బాబా అజ్మీర్ వెండి పథకం సాధించారు. ఈ విద్యార్థి సీఎం కప్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంధీర, జాయింట్ కలెక్టర్ సురేంద్ర ప్రతాప్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ డిస్టిక్ యూత్ స్కూల్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థి ఎస్కే బాబా అజ్మీర్ ను కరాటే క్లబ్ పౌండర్ అబ్దుల్ నబీ అభినందించారు.

## విద్యార్థులు ప్రతిరోజు యోగా, ధ్యానం చేయాలి



**పెబ్బేరు డిసెంబరు 20 ప్రభాతవార్త :** పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు వనపర్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్లుగా పని చేస్తున్న మధు ,రమణ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు చదువుల వల్ల భయం దోలను, ఒత్తిడిని తొలగించుటకు, విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహించారు. విద్యార్థులు ప్రతిరోజు ధ్యానం చేయడం వల్ల ప్రశాంతతను పొందవచ్చని, మనసు నిలకడగా ఉంటుందని, చదువులో మనం అనుకున్న లక్ష్యాలు నెరవేర్చుకోవచ్చు అని తెలిపారు. మనసు ప్రశాంతంగా ఉంటే దేనినైనా సాధించవచ్చు, చదువులో అనుకున్న విజయాలను సొంతం చేసుకోవచ్చని విద్యార్థులకు తెలియజేస్తూ, విద్యార్థుల చేత, కళాశాల సిబ్బంది చేత ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ కళాశాల ప్రిన్సిపల్ భద్రాసేన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# అమిత్‌షా రాజీనామా చేయాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



అమరచింత బస్టాండులో కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

**అమరచింత డిసెంబరు 20 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ ,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజు ,ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ ,సిపిఎం మండల కార్యదర్శి జిఎస్ గోపి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి వెంకటేష్ ,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసిన కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటు సమావేశాలలో అంబేద్కర్ అనే పదం ప్యాషన్ గా మారిందని అవహేళన చేసి మాట్లాడడం అంబేద్కర్ రాజ్యాంగం పట్ల బిజెపికి ఉన్న వ్యతిరేకత దేశ ప్రజలందరికీ బిజెపి నిజ స్వరూపం బయటపడిందని వారన్నారు. దేశంలో న్యాయం పరిరక్షించాల్సిన హోం శాఖ మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వెంటనే ప్రధానమంత్రి జోక్యం చేసుకొని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను పార్లమెంటు నుండి బహిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల దేశంలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు సమన్యాయం చేసిన గొప్ప మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వారన్నారు. భారత్ రాజ్యాంగ రచించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం అణిచివేయడానికి కుట్ర పన్నుతుందని దేశంలో ఉన్న దళిత గిరిజన మైనార్టీ బీసీ సుబ్బండ వర్గాలు బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న ,అరుణ్ కుమార్ ,ప్రకాష్ ,రవి ,సేమ్ రత్తి మహమూద్ ,అంజి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల జీవితాల్లో వెలుగులు నింపింది కాంగ్రెస్ ప్రభుత్వం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

**ఆత్మకూరు డిసెంబరు 20 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా రైతుల జీవితాల్లో వెలుగులు నింపి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కళ్ళల్లో సంతోషం చూస్తుందని కాంగ్రెస్ అనుబంధ సంఘమైన కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే 21 వేల కోట్ల రూపాయలు కేటాయించి రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టులోని చుక్క నీటిని వాడకుండా 66 లక్షల ఎకరాల్లో వరి పైరును సాగు చేసి లక్షలాది టన్నుల్లో వరి ధాన్యాన్ని పండించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన కొనియాడారు. రైతులకు రుణమాఫీతో పాటుగా గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సన్న రకం క్వింటాలకు 500 రూపాయల బోనస్ చెల్లించి రైతుల జీవితాల్లో వెలుగులు నింపిందని ఆయన అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బిడ్డగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో అదనంగా 20 లక్షల వరి సాగుకు ప్రయత్నాలు కొనసాగిస్తుందని రాబోయే సంవత్సరం కాలంలో అదనంగా రైతులకు నీరు అందించి పంటలు పండించేందుకు పుష్కలంగా నీరు అందిస్తుందని ఆయన అన్నారు. అంతేకాకుండా ఉపాధి కూలీలకు సైతం వేతనాలు పెంచి కూలీల కళ్ళల్లో ఆనందం నింపుతుందని ఆయన అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికి అత్యధిక స్థానాలలో గెలిపించేందుకు రైతులు ముందుండి కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొగిలి ,గంగాధర్ గౌడ్ ,ఆత్మకూరు మండల కిసాన్ సెల్ అధ్యక్షులు వినయ్ కుమార్ రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ చేపట్టిన నిరసనకు బిజెపి మద్దతు


నిరసన దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

**గద్వాలటౌన్ డిసెంబరు20 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాలజిల్లా కోర్టు సముదాయ నిర్మాణస్థలం విషయంలో న్యాయవాదులు చేస్తున్న 3వ రోజు నిరసన దీక్షకు భారతీ జనతాపార్టీ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గద్వాల న్యాయవాదలు చేస్తున్న నిరసన సమంజసమైనదిగా తమ పార్టీ భావిస్తున్నదన్నారు. అదే సమయంలో న్యాయవాదులు, కక్షిదారుల రక్షణ , ప్రజల అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఈ నిరసనకు మద్దతు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ పని సాధనకు గద్వాల బార్ అసోసియేషన్ చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు తమ పార్టీ మద్దతుగా నిలుస్తుందని రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా కోర్టు భవన సముదాయం అనంతపురం గుట్టల్లో ప్రజలకు అందుబాటులో లేని స్థలంలో నిర్మించవద్దని జిల్లా కేంద్రం బిజెపి క్యాంపులో కలెక్టర్ జిల్లా ఎస్పీ కార్యాలతో పాటు న్యాయస్థాన భవనాలను నిర్మించాలని అన్నారు. కక్షిదారులకు ఏమాత్రం ఉపయోగం, రక్షణ సౌకర్యాలు, వసతులు లేని నిర్మాణస్యమైన గుట్టల ప్రాంతంలో నిర్మించాలని పూనుకోవడం దారుణమైన విషయమని అన్నారు. బిజెపి క్యాంప్ కార్యాలయ స్థలంలో కోర్టు సముదాయాన్ని నిర్మిస్తే ఖచ్చిదారులకు రవాణా సౌకర్యం సులభంగా ఉంటుందని, కోర్టుతోపాటు, కలెక్టర్ కార్యాలయం ,ఎస్పీ కార్యాలయంతో పాటు పట్టణంలో అన్ని పనులు చూసుకోవచ్చని ఇది సామాన్య మానవునికి అర్థమవుతుంది కానీ ,జిల్లా అధికారులకు ,ఎమ్మెల్యేలకు, ఎందుకు అర్థం కావడం లేదనీ ప్రశ్నించారు. గతంలో డికె అరుణమ్మ 1600 మంది పేదలకు ఇచ్చిన స్థలంలో ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా మెడికల్ కళాశాల నిర్మించి ప్రజల ఉసురు తీసుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి ఎగ్బోటే,జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహులు,బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకటరాములు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు దేవదాస్, ఐటి సెల్ జిల్లా కన్వీనర్ చిత్తారి కిరణ్, బిజే ప్రధాన కార్యదర్శి తరుణ్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ అనిల్, సీనియర్ నాయకులు డబ్బిలేటి నరసింహ,ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి



విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నాయకులు

**కొత్తకోట డిసెంబరు 20 ప్రభాతవార్త :** సమగ్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తకోట మండలంలోని ఆమడబాకుల కేజీబీవీ పాఠశాల ముందు విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో భాగంగా కస్తూర్బా బాలికల విద్యాలయం ఉపాధ్యాయనియుల సమ్మెబాట పట్టడంతో విద్యార్థినిల 7 రోజులుగా బోధన నిలిచిపోయిందని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈనెల 6 నుండి సమ్మె చేస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బోధన సిబ్బంది కాంటాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ బోధ నేతల సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సమ్మె వల్ల విద్యార్థులకు బోధనపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో విద్య బోధన కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తక్షణమే తరగతులు నిర్వహణ జరిగేలా చూడాలని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా తక్షణమే సమస్యలకు పరిష్కరించి ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యే విధంగా చూడాలి ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల భద్రత కల్పించాలని కోరారు. వారికి కనీస వేతనం పే స్కేల్ అమలు చేయాలి ప్రతి ఉద్యోగికి జీవిత భీమా 10 లక్షలు, ఆరోగ్యశ్రీ బీమా 5 లక్షలు ల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యాశాఖ నియామకంలో వెయిటేజ్ కల్పించి 51 సంవత్సరాల నుండి పదవి విరమణ ఉన్నవారికి బెనిఫిట్ 20 లక్షలు కల్పించాలని అలాగే ప్రభుత్వం గుర్తింపు కార్డును జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నిఖిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు

### షి టీమ్ పోలీసులు బాలరాజ్, చెన్నయ్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని షిటీం పోలీసులు బాల్ రాజ్, చెన్నయ్య అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్షిప్ లక్షణాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్య లు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వం మరియు విజయవంతమైన భవిష్యత్తు కోసం బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. కాలేజీల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే అవకాశాలుంటాయి కాబట్టి అలాంటి వాటికి దూరంగా వాటి వల్ల చాలా మంది విద్యార్థులు చదువులు మధ్యలో ఆపేయడం జరుగుతుంది. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే పేట షీ టీం సెల్ నంబర్ 8712670398 పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని గంజాయి, డ్రగ్స్ కి బానిసలై తమ లక్ష్యాలను నెరవేర్చుకోక ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడటం జరుగుతుంది. అలాంటి వాటికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ కనబరిచి తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు గేమ్స్ ఆడాలని ఏదో ఒక గేమ్ పై మక్కువ చూపాలని, క్రీడలు ఆడడం వల్ల లీడర్షిప్ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు లీడర్షిప్ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. పోటీ పరీక్షల గురించి ఇప్పటినుండి వాటిపై దృష్టి పెట్టి బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు, లెక్చరర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి

### చెక్‌ను అందజేసిన ఎమ్మెల్యే సతీమణి

**గద్వాలటౌన్ డిసెంబరు 20 ప్రభాతవార్త :** సీఎం సహాయ నిధి 60,000 రూపాయల చెక్కును ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి లబ్ధిదారులకు అందజేసారు. శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల పట్టణం భీంనగర్ కు చెందిన సత్యవతి భర్త కృష్ణయ్య ఆచారికి చికిత్స నిమిత్తం బండ్ల జ్యోతి చేతుల మీదుగా సీఎం సహాయం నిధి 60,000 రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, మాజీ డైరెక్టర్ చాకలి శంకర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేర్‌లో వరిగడ్డి దగ్ధం

**పెబ్బేరు డిసెంబరు 20 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో చెనిమిల్లకు చెందిన 6వ వార్డులో కర్ణాకర్ గౌడ్ అనే పాడి రైతు వరిగడ్డి కుప్పను గురువారం రాత్రి12గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారని కర్ణాకర్‌గౌడ్ తెలియజేశారు.ఆసమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వగా కొత్తకోట ఫైర్‌సిబ్బంది సహాయంతో మున్సిపల్ వాటర్ ట్యాంకర్లుతో మంటలను అదుపులోకి తెచ్చారని తెలియజేశారు.ఈ వరిగడ్డి సుమారు లక్షపైన విలువ చేస్తుందని నష్టం జరిగిందని ప్రభుత్వం సహకరించి ఆదుకోవాలని కరుణాకర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

## భూత్పూర్ పీహెచ్‌సీలో ఫైర్ మాక్‌డ్రిల్


పీహెచ్‌సీలో ఫైర్ సేఫ్టీ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

**భూత్పూర్,డిసెంబరు 20,ప్రభాతవార్త:** ఫైర్ సేఫ్టీ చర్యల్లో భాగంగా జిల్లా అగ్ని మాపక కేంద్రంలో ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగానే శుక్రవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జిల్లా ఫైర్ సేఫ్టీ విభాగం సిబ్బంధి జిల్లా ఫైర్ ఆఫీసర్ మల్లిఖార్జున్ ఆదేశాలమేరకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. అనుకోకుండా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో,ప్రమాదంలో ఎలా బయటపడాలో కార్బన్ డయాక్సైడ్,డీసీపీని ఎలా ఉపయోగించాలో ప్రదర్శన ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్,సీహెచ్ఓ అయూబ్‌ఖాన్,స్టాఫ్ నర్సు స్వాతి,ఫైర్ సిబ్బంధి రాఘవేందర్,సమరసింహ్మారెడ్డి,బాల్‌రాజ్ పాల్గొన్నారు.

## అమిత్‌షాను వెంటనే

## పదవీ నుంచి తొలగించాలి

### బిఎస్పి పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరస

**పెబ్బేరు డిసెంబరు 20 ప్రభాతవార్త :** పార్లమెంట్ సమావేశాలలో అమిత్ షా అంబేద్కర్ పైన చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పెబ్బేరు సుభాష్ చౌరస్తా దగ్గర ఉదయం 10 గంటలకు బహుజన సమాజ్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల నుంచి, పెబ్బేరు పట్టణ నుంచి భారీ ఎత్తున పాల్గొని బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో సుభాష్ చౌరస్తా దగ్గర నిరసనలు తెలుపారు. ఘణపురం కృష్ణ బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గూడెం ఎల్ల స్వామి బిఎస్పీ వనపర్తి జిల్లా అధ్యక్షులు, వెంకటన్న గౌడ్, పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి,ఖాజా సిపిఎం పార్టీ నాయకులు, ఎర్రం భరత్,అశోక్,స్రామ్రాట్,మనోహర్,కార్తిక్,గుడిసె ధర్మ, రాము, లక్ష్మణ్, నచికేత, విజయ్, గణేష్, కుర్మయ్య, అఖిల్, పరమేష్, శివ. తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి

## ఆలయ ప్రాంగణానికి భూమి పూజ

**ఉప్పునుంతల, డిసెంబర్ 20 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం ముందు ప్రాంగణం నిర్మాణం కోసం శుక్రవారం విశ్వబ్రాహ్మణ సోదరులు భూమి పూజ చేశారు. భూమి పూజ చేసిన వారిలో విశ్వబ్రాహ్మణ సోదరులు ఉప్పునుంతల కృష్ణమాచారి, కపిలవాయి లక్ష్మీపతి, ఉప్పునుంతల రవి, ఉప్పునుంతల రమేష్, అప్పొజు వెంకటేష్, కపిలవాయి జంగయ్య, శ్రీనువాసులు, స్థానికులు బింగి గోపాల్, శంకర్ తదితరులు ఉన్నారు.

## కృష్ణ ఎస్సైకు మండల

## బీఆర్ఎస్ నాయకుల సన్మానం

**దేవరకద్ర, డిసెంబరు 20 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ఎస్సై నవీద్ ను గురువారం రాత్రి దేవరకద్ర మండలం బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై పుట్టినరోజు సందర్భంగా శాలువా కప్పి, పూలమాలలు వేసి మేమోంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండలం టిఆర్ఎస్ నాయకులు చల్మారెడ్డి, సదానంద్, హరీష్, భార్గవ్, రంజిత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు: ఏఎస్సై ఆంజనేయులు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

**నారాయణపేట టౌన్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఏఎస్సై ఆంజనేయులు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రధాన రహదారిపై నారాయణపేట పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించరాదని ఎవరైనా కార్ అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగిస్తే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనదాలకు సూచించారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు. వాహనదారులు రోడ్డుపై వాహనాలను పార్కు చేయరాదని టూ వీలర్స్ పై ఇద్దరకు మించి ప్రయాణించరాదని ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను, కూలీలను ఎక్కించుకోరాదని ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంతవరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడరాదని ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని పరిమిత వేగంలో వాహనాలు నడపాలని ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై రేవతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమిష్టిగా మన హక్కులను మనమే కాపాడుకుందాం!

## టీఎన్జీవోస్ హాలు ప్రారంభ సభలో కేంద్ర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



టిఎన్జిఓ జిల్లా నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

**గద్వాల డిసెంబరు 20 ప్రభాతవార్త:** టిఎన్‌జీఓ ఉద్యోగులు అందరూ కూడా ఐక్యతతో ముందుకు వెళ్లి సమిష్టిగా మన హక్కులు, సమస్యల సాధించుకోవాలని టిఎన్‌జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ సూచించారు. శుక్రవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ జోగులాంబ గద్వాల జిల్లా శాఖ మీటింగ్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ ముఖ్య అతిగా హాజరై ప్రారంభించారు. అనంతరం టీఎన్జీఓ భవనం ఆవరణ మునందు ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎన్జీఓస్ జోగులాంబ జిల్లా అధ్యక్షుడు నాగర్జున గౌడ్ సభకు అధ్యక్షత వహించారు. ఈ సభలో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా టీఎన్జీఓఎస్ శాఖ ప్రత్యేక సంతరించుకుందని వివిధ జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలలో సంఘ భవనాలు ఉంటే,ఇక్కడ మాత్రం సభ్యుల సొంత డబ్బుతో కొనుగోలు చేసి సొంత భవనం నిర్మించడం గత నాయకులు ముందు చూపు నిదర్శనమని ఆయన అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉద్యమాల గడ్డని ఎందరో అమరవీరులను కన్న భూమిని ఈ గడ్డకు ఘనమైన చరిత్ర ఉందన్నారు.ఈ జిల్లా నాయకత్వం సభ్యుల సమస్యలు వెనువెంటనే మాదృష్టికి తీసుకొస్తుందని పరిష్కారం అయ్యేం తవరకు కేంద్ర సంఘంపై ఒత్తిడి తెస్తుందన్నారు.మంచి నాయకత్వం కలిగిన నాయకులు మీకు ఉన్నారని ఆయన తెలిపారు. ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్నాయని,వాటిని సాధించాలంటే మనం అందరం సమిష్టిగా సాధించాలని ఆయన అన్నారు. మన సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. ఆర్థికపరంగా కొంత ఇబ్బంది, కాలయాపనైన మన సమస్యలు ఈ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీఎన్జీఓ జోగులాంబ జిల్లా అధ్యక్షుడు నాగార్జునగౌడ్ మాట్లాడుతూ గత నాయకులు స్ఫూర్తి తీసుకొని సంఘ అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించే దిశలో ప్రయత్నం చేస్తున్నామన్నారు. గద్వాల పట్టణ కేంద్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాన్ని కలుపుకొని తాసిల్దార్‌కార్యాలయం ఒకటే ఉన్నందున ఉన్న ఉద్యోగులకు అదనపు భారం పడుతుందని, ప్రజలకు, ఉద్యోగులకు సౌకర్యం కొరకు అదనపుగా నూతన తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి బీజాపూర్ ఆనంద్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కొరకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఫండ్ జోగులాంబ జిల్లాకు చెందిన ఫండ్ జిల్లా కలెక్టర్ పరిధిలోకి తేవాలన్నారు. ఈ జిల్లాకు చెందిన ఉద్యోగులు పక్క రాష్ట్రం వైద్య చికిత్స చేసుకున్న మెడికల్ బిల్లులు యధాతథంగా చెల్లించాలని కోరారు. గద్వాల పట్టణం జిల్లా కేంద్రం, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ లక్షకు పైన జనాభా కలిగినందున 30 హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ కేంద్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్ టీఎన్జీఓస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, వనపర్తి జిల్లా అధ్యక్షులు అశోక్, మెదక్ జిల్లా అధ్యక్షులు నరేందర్, టీఎన్జీఓస్ రాష్ట్ర కార్యదర్శి,భీమన్న,గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు రహి ముద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి,టీఎన్జీఓ జోగులాంబ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నాగేష్, జిల్లా కోశాధికారి విష్ణు,టీఎన్జీఓస్ జిల్లా నాయకులు లోకరాజు, రామకృష్ణారావు, జయరాములు, వెంకటేశ్వర రెడ్డి, సుధీర్ గౌడ్, బైరెడ్డిసుధాకర్, జగన్, రమేష్, ప్రమీల సుధారాణి, భద్రుని సా బేగం,ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు వెంకట్రాంరెడ్డి,బాలాజీ బాబు,రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు చక్రధర్,రాజ వర్ధన్ రెడ్డి, వర్క్ చార్జి ఉద్యోగులు, వివిధ శాఖల సంఘ నాయకులు,ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


నూతన భవనం ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

## మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఛలో హైదరాబాద్


వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మక్తల్, డిసెంబరు 20 ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో శనివారం చలో హైదరాబాద్ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామని మున్సిపల్ కార్మికులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గోవిందరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి నిరసన చేపట్టి మునిసిపల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. తక్షణమే మున్సిపల్ కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు అందజేయాలన్నారు. పట్టణాల్లో, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కార్మికులకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు క్రెమ్‌కృష్ణ, సయ్యద్ జాకీర్ హుస్సేన్, టి. మూర్తి, వెంకటగిరి, మారెప్ప, జి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్ ఫోన్లను అప్పగించిన ఎస్సై


బాధితులకు ఫోన్లను అందజేస్తున్న ఎస్ఐ నరేష్ కుమార్

**గోపాలపేట డిసెంబరు 20 ప్రభాత వార్త:** మండల పరిధిలోని చాకలి పల్లి గ్రామానికి చెందిన లొంక జైపాల్‌రెడ్డి పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను ఎస్సై నరేష్ కుమార్ శుక్రవారం అందజేశారు. అదేవిధంగా కోడేరు మండల పరిధిలోని సింగయిపల్లి గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని బాధితులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు. చాకలి పల్లి గ్రామానికి చెందిన లొంక జయపాల్ రెడ్డి దాదాపు ఏడాది క్రితం దాదాపు పదిహేను వేల రూపాయల విలువగల సెల్‌ఫోన్ పోవడంతో గోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు తెలియజేయగా కేసు నమోదు చేసుకుని సిఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ గుర్తించినట్లు తెలిపారు. కోడేరు మండల పరిధిలోని సింగయిపల్లి గ్రామానికి చెందిన రాములు నెల రోజుల క్రితం ఇరువైరెండు వేల రూపాయల విలువగల తన సెల్ ఫోన్ ను పోగొట్టుకొని స్టేషన్ లో ఫిర్యాదు చేయగా సిఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బాధితులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే భర్తరఫ్ చేయాలి

◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

**నారాయణపేట టౌన్, డిసెంబరు20 ప్రభాతవార్త:** పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ను అవమానపరుస్తూ మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను వెంటనే మంత్రి పదవినుండి తొలగించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. దామరగిద్ద మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో భూపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత భారతదేశానికి గుండెకాయగా ఉన్న రాజ్యాంగంపై దాడిచేస్తూ లౌకిక ప్రజాస్వామ్యంను అవహేళన చేస్తూ ఈ దేశాన్ని పట్టిపీడిస్తున్న కులం, మతం పేరుతో దళితులపై, మైనారిటీ వర్గాలపై దాడిచేస్తూ ప్రాంతాల మధ్య,జాతుల మధ్య ఘర్షణలు సృష్టిస్తూ దేశాన్ని అస్థిర పరుస్తుందని విమర్శించారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ ,రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యలు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్,బిజెపిలు ఈ దేశాన్ని హిందూ దేశం గా మార్చాలనే కుట్రలోభాగంగా భారత రాజ్యాంగాన్ని మార్చి బానిసలుగా మార్చే మనువాద శాస్త్రాన్ని తీసుకవచ్చే ఆలోచనలో భాగంగానే కేంద్ర మంత్రి అంబేద్కర్ ను అవమానపరుస్తూ మాట్లాడారు అన్నారు.రాజ్యాంగంపై ప్రమాణం చేసిన అమిత్ షానువెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జోషి, అంబేద్కర్ సంఘంనాయకులు ఆనంద్, వెంకటప్ప, హన్మంతు, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళ ఎంపి పట్ల అనుచితంగా ప్రవర్తించిన రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలి

◆ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు లక్ష్మీశ్యామ్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** పార్లమెంట్ లో నాగాలాండ్ కు చెందిన గిరిజన మహిళా ఎంపి.ఫాంగ్ సాన్ కోన్యాన్ పట్ల పార్లమెంట్ విపక్ష నేత రాహుల్ గాంధీ అనుచితంగా ప్రవర్తించిన తీరు సమంజసం కాదని ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక గిరిజన మహిళ ఎంపి పట్ల అసౌకర్యంగా రాహుల్ గాంధీ ప్రవర్తించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎప్పుడు రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని తిరిగే ఆయనకు మహిళల పట్ల వ్యవహరించే తీరు రాజ్యాంగం నేర్పిందా అని ప్రశ్నించారు. రాజ్యాంగంపై చిత్త శుద్ధి లేనివారే ఇలా ప్రవర్తిస్తారు అన్నారు. ఇప్పటికైనా రాహుల్‌గాంది నిజస్వరూపం సొంత కాంగ్రెస్ నాయకులు గుర్తిస్తే మంచిదని హితవు పలికారు.

## ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన


మాదిరి ఎన్నికల నిర్వహణ చేస్తున్న విద్యార్థులు

**బిజినేపల్లి, డిసెంబరు 20 ప్రభాతవార్త:** నంది వడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదిరి అసెంబ్లీ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. మాదిరి ఎన్నికలను పూర్తిగా ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి విద్యార్థులకు నామినేషన్ ప్రక్రియ నుండి పోటీ చేసిన అభ్యర్థుల ప్రచారం ఎన్నిక గుర్తులపై అవగాహన ఓటింగ్, ఫలితాల లెక్కింపు ప్రక్రియ నిర్వహించి విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఓటు చాలా ప్రాధాన్యత ఉందని ఓటు విలువ ప్రజాస్వామ్యంలో చాలా విలువైనది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రిటర్నింగ్ ఆఫీసర్‌గా ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. మాదిరి ఎన్నికల ముగింపు సమావేశానికి మండల విద్యాధికారి రఘునందన్ హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంత్ రెడ్డి ఉపాధ్యాయులు కృష్ణ కుమార్, హుస్సేన్ చంద్రమోహన్‌రెడ్డి, వెంకట్ స్వామి, లక్ష్మిపతి, పరమేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

## నిబద్ధతతో పనిచేస్తేనే మంచి గుర్తింపు


లక్ష్మణ్ నాయక్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

**పానగల్ డిసెంబరు 20 ప్రభాతవార్త:** ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులు నిబద్ధతతో నిజాయితీతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని పూర్వపు ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోనీ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుత ఎంఈఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటుచేసి న ఆత్మీయ వీడుకోలు సమావేశంలో ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బదిలీ అయినా ఎంఈఓ లక్ష్మణ్ నాయక్‌తో తమకున్న అనుబంధాన్ని ఒక్కొక్కరుగా గుర్తు చేశారు దాదాపు 25వ సంవత్సరంలో ఎంఈఓగా మండలానికి వచ్చిన ఆయన దాదాపు20 సంవత్సరాలుగాఒకే మండలంలో పని చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనం అన్నారు 20 సంవత్సరాల తర్వాత బదిలీపై వెళ్తున్న తనకు తమ కుటుంబాన్ని వదిలి వెళుతున్నంతగా బాధను వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు కూడా విధుల పరంగా ప్రతి ఒక్కరూ మంచి పేరు సంపాదించాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగరీత్యా ఈ 20 సంవత్సరాలు ఎవరికైనా తన నుండి ఎలాంటి ఇబ్బందులు కలిగించినా అన్యధా భావించ వద్దని అన్నారు. ఇన్ని సంవత్సరాలు తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ మరో ఉపాధ్యాయురాలు పాటలతో తమ భావాలను వ్యక్తపరిచారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ లక్ష్మణ్ నాయక్ చేసిన సేవలను కొనియాడారు.

**ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి:** ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. ఇటీవల ఎంఈఓ గా పదోన్నతి పొందిన ఆయన పానగల్ ఎంఈఓ గా కొనసాగుతున్నారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ విధుల పట్ల నిబద్ధత పాటిస్తూ ప్రజలతో విద్యా ర్థుల తల్లిదండ్రులతో సంయమనం పాటిస్తూ విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులది అని అన్నారు. కాగా ఏక కాలంగా 20సంవత్సరాలు ఒకే మండలంలో పని చేయడం పట్ల ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ పట్ల ప్రజా ప్రతినిధులకు ప్రజలకు ఉన్న సత్సంబంధాలపై మంచి అభిప్రాయం ఉండబట్టే అంత కాలం పనిచేస్తూ మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. అలాగే బదిలీ అయినా శంషాబాద్ లో కూడా మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి మరిన్ని పదోన్నతులు పొందాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన బాటలోనే తాను కూడా పయనిస్తానని అన్నారు.అనంతరం పూర్వపుఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌కు ఘన సన్మానం సన్మానం చేశారు.

## ఆటో వర్కర్స్‌ను అక్రమంగా అరెస్టు చేయడం తగదు

సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్

**నారాయణపేట టౌన్, డిసెంబరు20 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసిన ఆటో వర్కర్స్ లను వెంటనే విడుదల చెయ్యాలని టియుసిఐ కార్మిక సంఘం నాయకులు, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కే.కాశీనాథ్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12000 జీవన భృతి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అధికారం వచ్చి సంవత్సరం పూర్తి అవుతున్న ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన తర్వాత చాలామంది మహిళలు ఆటోలు ఎక్కకుండా బస్సు ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఆటో కార్మికులకు ఉపాధి చాలా ఇబ్బందికరంగా మారింది. రోజువారీగా ఫైనాన్స్‌లు కట్టడం కూడా చాలా ఇబ్బందిగా ఉన్నది. జీవితాలు వెల్లతీయడం కష్టంగా మారింది. మహిళలకు ఉచిత బస్సు స్కీమ్ మంచిదే కానీ ఆటో వర్కర్లకు ప్రత్యామ్నాయ ఉపాధిని రాష్ట్ర ప్రభుత్వం సూచించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న ఆటో యూనియన్ నాయకులను నారాయణపేట జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషనులకు తరలించారు. దీనిని టియుసిఐ తీవ్రంగా ఖండిస్తున్నది. ఆటో వర్కర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో వర్కర్స్‌కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్‌లను ఆటో కార్మికులకు వర్తింప చేయాలి. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

## నంది వడ్డేమాన్‌లో అయ్యప్ప శరణుఘోష


పడిమెట్ల పూజలో పాల్గొన్న గురుస్వాములు

**బిజినేపల్లి, డిసెంబరు20 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ గ్రామంలో శుక్రవారం అయ్యప్ప శరణుగోషతో ఓలలాడింది. నందకిషోర్‌రెడ్డి గురుస్వామి 18సారీ అయ్యప్ప మాల ధరించిన సందర్భంగా ఏర్పాటుచేసిన పడిమెట్ల పూజ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అయ్యప్ప గురుస్వాములు తంత్రీ మురళి నంబోద్రి, ముత్తు గురు స్వా మి నరేందర్ గురుస్వామి వేద మంత్రోచ్చరణల మధ్య అయ్యప్ప స్వాములు హరహర సుతన సుతన, స్వామియే శరణం అయ్యప్ప శరణం అంటూ అయ్యప్పస్వామి శరణు ఘోషతో నందకిషోర్‌రెడ్డి ఇంటి ఆవరణ శరణు ఘోష పెట్టింది. పెద్దసంఖ్యలో అయ్యప్పదీక్షాధారులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. గురుస్వాముల ఆధ్వర్యంలో పదునెట్టాంబడి మహా పడిపూజ నిర్వహించారు. మహాపడిపూజ అనం తరం గురుస్వాములు మాట్లా డుతూ శబరిమల సన్నిధానంలో ఉండే 18 మెట్లకు విశేష ప్రాధాన్యత ఉందని దుష్టశక్తులను సంహరించడానికి అయ్యప్పస్వామి ఉపయోగించిన 18 ఆయుధాలుగా వీటిని పేర్కొన్నారు.స్వామి సన్నిధానంలో విగ్రహ రూపం దాల్చకముందు ఆ ఆయుధాలను ఒక్కో మెట్టు వద్ద ఉంచారని చెప్పారు. 18 మెట్లు 18 పురాణాలను సూచిస్తాయని,రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాల్లో 18 అధ్యాయాలు ఉన్నాయన్నారు. అయ్యప్పస్వామి ఎక్కడో ఉండరని, మాలాధారణ వేసిన ప్రతి వ్యక్తిలోనూ ఉంటారని చెప్పారు. మాలాధారణ చేసిన వ్యక్తిని తనభార్య కూడా అయ్యప్పగానే చూస్తుందని,తల్లిదండ్రులు సైతం కాళ్లకు నమస్కారం చేస్తారని తెలిపారు. అయ్యప్ప దీక్షాధారణ చేస్తే ఆ వ్యక్తిలోనే అయ్యప్పను దర్శించుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమాల్లో అయ్యప్ప గురుస్వాములు,అయ్యప్పసేవాసమితిసభ్యులుగ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

**చిన్నచింతకుంట, డిసెంబరు 20 ప్రభాతవార్త:** అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అధికారులు తెలుపుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో వివిధ శాఖల అధికారులు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో నమోదు చేస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెంది ఇల్లు లేని వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అధికారులు ఇందిరమ్మ ఇండ్లసర్వేలో తెలుపుతున్నారు.ప్రజా పాలన దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఇండ్లకు వెళ్లి ఇందిరమ్మ యాప్ లో నమోదు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, జూనియర్ అసిస్టెంట్ వెంకట రాములు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎస్ వెంకటేష్, శేఖర్, ఎండి గౌస్, స్వప్న, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అలివివల వేటపై పోలీసుల దాడి : కేసు నమోదు

**చిన్నంబావి, డిసెంబరు20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెల్ల పాడు గ్రామంలో కృష్ణానది తీర ప్రాంతంలో అలవి వల వేట కొనసాగుతుందని నమ్మదగిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం స్థానిక ఎస్సై జగన్మోహన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారనీ ఎస్సై జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిషేధిత అలివివలను పట్టుకోవడం జరిగిందనీ, అలవివలతో కొందరుజాలర్లు చిన్నపాటి చేపలను సైతం వేటాడడం చట్టరీత్యా నేరమని ఎస్సై అన్నారు. అలవి వలపై నిర్వహించిన దాడుల్లో ముగ్గురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కాలూరు గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి కొందరు వ్యక్తులతో చేపల వేట కొనసాగిస్తుండడంతో దాడులు నిర్వహించి అజయ్, వెంకన్న,కృష్ణలను అదుపులోకి తీసుకొని ముగ్గురుపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇట్టి సంఘటనపై ఎస్సై జగన్మోహన్ మాట్లాడుతూ మండల పరిధిలోని కృష్ణ నది తీరంలో ఎవరైనా నిషేధిత అలివి వలతో చేపల వేట కొనసాగిస్తే, చట్టరీత్య క్రిమినల్ కేసులు నమోదు చేస్తాము అని హెచ్చరించారు.

### ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలి

పేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్

**నారాయణపేట టౌన్, డిసెంబరు20 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని చట్టాల గురించి తెలుసుకోవాలని నారాయణపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీసెన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శాసన్ పల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నారు. హక్కుల పట్ల భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వరకట్న నిషేధం చట్టం(1961)గురించి వివరించారు. తదుపరి చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ లక్ష్మిపతీ గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ మూడులక్షల ఆదాయం ఉన్నవారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు మీ యొక్క సమస్యలకు 15100 కు ఫోన్ చేయడం వలన మీయొక్క సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసురేష్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కే. లక్ష్మీపతిగౌడ్,పంచాయతీ కార్యదర్శిభాను ప్రకాష్, కానిస్టేబుల్,పరలీగల్ వాలంటీర్స్, సుధాకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్

## చిన్న రాజమూర్‌లో కోడెదూడల వేలం పాట

**దేవరకద్ర, డిసెంబరు 20 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ లోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం కోడెదూడల వేలంపాట నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయానికి భక్తులు సమర్పించిన దాదాపు 40 కోడెదూడలను ఈ సందర్భంగా వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో దేవాలయానికి కోడెదూడల ద్వారా రూ.1లక్ష87వేల300 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రాఘవేంద్ర చారి, ఈఓ కవిత, ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బుర్దపేట హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా జడ్జి

**గద్వాల డిసెంబరు 20 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం గద్వాలలోని బుర్దపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తినే భోజనాన్ని ఆమె పరిశీలించారు.అదేవిధంగా విద్యార్థినిలకు తమకు మూత్రశాలలు లేవని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణంలో ఉన్న మూత్రశాలలను పరిశీలించినఆమె త్వరితగతిన పనులు పూర్తయ్యేల సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తారని చెప్పారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**కొత్తకోట డిసెంబరు 20 ప్రభాతవార్త:** కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహాముద్ అనారోగ్యంతో హైదరాబాద్ ఈఏంటి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన దేవరకద్ర అసెంబ్లీ ఎన్ఎస్‌యుఐ ప్రెసిడెంట్ ఎండి ముస్తఫా దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితుని పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే గ్రామస్తుల సాయం ద్వారా పది వేలు ఆర్థికసాయాన్నిఅందజేశారు. మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## నిరుద్యోగులు దళారీలను నమ్మి డబ్బు వృథా చేసుకోవద్దు

■ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

**నారాయణపేట జిల్లా, డిసెంబరు20 ప్రభాతవార్త :** నిరుద్యోగులు దళారీలను నమ్మిడబ్బు వృథా చేసుకోరాదని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వైద్యశాఖలోఉద్యోగాలు వస్తాయని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డా.సౌభాగ్యలక్ష్మి ఒక ప్రక టనలో తెలిపారు. ఇటీవల నారాయణపేట పి. హెచ్. సి. ఆసు పత్రిలో ఉద్యోగాల కొరకుప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేయగా కొందరు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని వారిని ఒకరు 9836 330846,9490673253,82768415 98,అనే నంబర్ నుండి ఉద్యో గాలు ఇప్పిస్తానని అజ్ఞాత వ్యక్తి మోసం చేస్తూ నిరుద్యోగులనుదారి మళ్లిస్తూడబ్బులు గుంజే ఒదుకు ప్రయత్నిస్తున్నారని ఇలాంటి వారిని నమ్మవద్దని ఆమె సూచించారు.

## ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు



**కృష్ణ, డిసెంబరు20 ప్రభాతవార్త :** కృష్ణ మండలం గుడేబల్లూరు గ్రామంలో, ఏపీజీవీబీ మాగనూరు మండలం బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్రాంచ్ మేనేజర్ జగదీష్ మాట్లాడుతూ,భద్రత పథకాలు అయిన ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమ యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనలో అర్హులైనటువంటి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. బ్యాంకు అందించే వివిధ రకాల సేవలు, సౌకర్యాల గురించి, మొబైల్ బ్యాంకింగ్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ గురించి వివరించారు. రుణాలు సకాలంలో చెల్లించడం ద్వారా ఉంది లాభాల గురించి అవగాహన కల్పించారు. మోసపూరిత ఫోన్ కాల్స్ ద్వారా డబ్బులు పోగొట్టుకుంటే 1930 నెంబర్‌కి కాల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జగదీష్, ఫీల్డ్‌ఆఫీసర్ రాజు,వినోద్, ఎఫ్ఎల్‌సికౌన్సిలర్ బి సురేష్, బ్యాంకు మిత్రకృష్ణ, ఇన్చార్జి ఏపిఎం బసవరాజ్ పాల్గొన్నారు.

## న్యాయవాదుల దీక్షకు ఎంఐఎం మద్దతు



**గద్వాల డిసెంబరు20 ప్రభాతవార్త:** ఎంఐఎం జిల్లా అధ్యక్షులు మున్నాభాష ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు న్యాయవాదుల నిరసన దీక్షకుశుక్రవారం మద్దతు తెలిపారు. అనంతపురం గుట్టల్లో కోర్టు నిర్మాణం చేయరాదని, గద్వాల పిజెపి క్యాంపు స్థలంలోనే నూతన కోర్టు నిర్మించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ ఇమాముద్దీన్, మండల అధ్యక్షులు ఎండి రఫీ, జిల్లా సెక్రెటరీ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్

**బిజినేపల్లి డిసెంబరు 20 ప్రభాతవార్త:** నంది వడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగు నీటిని అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ నెలకొల్పారు.హైదరాబాదుకు చెందిన కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ సహకారంతో కొరకు 500 లీటర్ల సామర్థ్యంతో మినరల్ వాటర్ ప్లాంట్ అందించారు. ఫౌండేషన్ సభ్యులకు పాఠశాల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంత్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి నాగిరెడ్డి,నూరుద్దీన్ పాల్గొన్నారు.

## పాముకాటుతో వృద్ధురాలు మృతి

**నారాయణపేట టౌన్, డిసెంబరు20 ప్రభాతవార్త:** పాము కాటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం బాపన పల్లి గ్రామంలో చోటుచేసుకుంది.అందుకు సంబంధించి గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దామర గిద్ద మండలం బాపన్‌పల్లిగ్రామానికి చెందిన జనగరి అరవిందమ్మ (65) శుక్రవారం రోజు తెల్లవారుజామున రోజు వారీగా5 నుండి 6గం.ల మధ్యలో నిద్ర నుండి మేల్కొని ఇంటి పక్కన ఉన్న ఒరాళ్లకుప్పపై కూర్చొని ఉంది.రాళ్ల కుప్పలో ఉన్న పాము కాటు వేసింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. రాళ్లకుప్పలో ఉన్న పామును వెతికి చంపే శారు. చికిత్స నిమిత్తం గ్రామానికి సమీపంలో ఉన్న ఓ మంత్రగాడి దగ్గరకు వెళ్లి మంత్రం వేయించారు.పరిస్థితి విషమించడంతో చేసేది లేక నారాయణపేట జిల్లా ఆసుపత్రికి వెళుతుండగా మార్గమధ్యంలో చనిపోయింది. మూఢనమ్మకాలను నమ్ముకుంటూ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

### అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా

## వరి ధాన్యం సేకరణ పూర్తి చేస్తాం

■ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పోతుల మధుసూదన్ రెడ్డి



**అయిజ డిసెంబరు 20 ప్రభాతవార్త:** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అకాల వర్షాలకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా వరి ధాన్యం సేకరణ సెంటర్లలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పోతుల మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నతాండ్రపాడు గ్రామ వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. వరి కొనుగోలులో జాప్యం లేకుండా ఉండాలంటే రైతులు అధికారులతో సహకారంతో పాటు వరి ధాన్యం 17 తేమ ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. గన్ని బ్యాగుల కొరత లేకుండా తూకం ప్రక్రియ పూర్తి చేసి లారీలతో వెంటనే ధాన్యాన్ని తరలించే బాధ్యత తమదేనని అన్నారు. రైతు వరి ధాన్యాన్ని మిల్లులకు తరలించిన వారం లోపే వారి అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నామని ఆయన రైతులతో అన్నారు. తమ వరిధాన్యాన్ని బాగా ఆరబెట్టి ఎదురు చూడడం రైతుల వంతైందని గన్ని బ్యాగులు సకాలంలో రావటం లేదని తెలుగుదేశం నాయకుడు సుధాకర్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. తాము ఇండెంట్ పెట్టిన వెంటనే సివిల్ సప్లై అధికారులు గన్నీ బ్యాగులను కొనుగోలు సెంటర్లకు పంపుతున్నారని, ఈ విషయంలో జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారాలను అందిస్తుందని, కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరలో ముగిస్తామన్నారు.

### సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన

## పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు



మున్సిపల్ కమిషనర్‌తో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు డిసెంబరు 20 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో గల పల్లె పకృతి వనం ధ్వంసం చేసి దుశ్చర్యకు పాల్పడ్డ దుండగులపై పోలీస్ స్టేషన్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని కాంగ్రెస్ నాయకులు తెలియజేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరుతూ వారిపై చర్యలు తీసుకోవాలని, సిసి రోడ్లు మంచిగా ఉన్న తోటి వేస్తున్నరని అలా చేయడం ఏమిటని, రోడ్డు డ్యామేజ్ ఉన్న తోటి రోడ్లు నిర్మించాలని, పకృతి వనం పక్కన ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బేస్మెంటును తొలగించాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండలాధ్యక్షుడు, విజయ్ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు అక్కమ్మ ,ఎల్ల స్వామి, డైరెక్టర్ రామన్ గౌడ్, నాయకులు దయాకర్ రెడ్డి, గంధం రంజిత్ కుమార్, యుగంధర్ రెడ్డి, షకిల్, రాములు తదితరులు పాల్గొన్నారు

## గద్వాల మండలాన్ని రెండు మండలాలుగా చేసేందుకు సకరించండి

■ టిఎన్‌జీఓ అధ్యక్షులు నాగార్జునగౌడ్




మాట్లాడుతున్న టిఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు నాగార్జునగౌడ్

**గద్వాల డిసెంబరు 20 ప్రభాతవార్త :** పరిపాలన సౌలభ్యం కోసం గద్వాల మండలాన్ని రూరల్, అర్బన్ మండలాలు గా విభజించాలని, అందుకు మీరు సహకరించాలని టిఎన్ జీఓ గద్వాల జిల్లా అధ్యక్షులు నాగార్జున గౌడ్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ కు వినతి పత్రం అందించారు. అదేవిధంగా ఒక రెవిన్యూ డివిజన్ ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. గద్వాల పట్టణం, మండలం రెండు కలుపుకొని 1 లక్ష 50వేల జనాభా ఉన్నదని, అందుకోసం రెండు మండలాలు చేయాలనీ కోరారు. 37 గ్రామాలు, 37 వార్డులు ఉన్నందున రెండు మండలాలు చేయాలన్నారు.

## అమిత్ షాను మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలి

■ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్య నాయక్, కెవి పీఎస్ జిల్లా అధ్యక్షులు భగత్



**పానగల్ డిసెంబరు 20 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం శాఖ మంత్రి అమీషా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై హోంశాఖ మంత్రిగా అమీత్‌షా పార్లమెంట్ నిండు సభలు చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. సభ ముఖంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు క్షమాపణ చెప్పాలని వారు కోరారు. అమిత్ షాను మంత్రి పదవి నుండి తొలగించకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు రాజు నాయక్ మండల నాయకులు దాసు నాయక్, వెంకటయ్య నాయక్ కెవిపిఎస్ మండల నాయకులు శేఖర్ ,భీమయ్య ,జిల్లా రైతు సంఘం నాయకులు జములయ్య ,భీమయ్య, వెంకట్‌రెడ్డి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము పాల్గొన్నారు.

## అమిత్ షా చేసిన వాఖ్యలను ఖండిస్తున్నాం: ఎమ్మార్పీఎస్ నాయకులు



**అయిజ డిసెంబరు 20 ప్రభాతవార్త:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్లో అంబేద్కర్ పైచేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మేడకొండ గ్రామంలోలో అంబేద్కర్ విగ్రహం సమీపంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కొందరికి అంబేద్కర్ పేరంటే నచ్చకపోవచ్చు కానీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేకపోతే మీరు ఢిల్లీలో కేంద్ర హోం మంత్రిగా పనిచేయడానికి అర్హత ఉండేదా అని ప్రశ్నించారు. అటువంటి మహనీయుడు పై పార్లమెంటులో అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని వ్యాఖ్యలను ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్గం ప్రెసిడెంట్ మేడికొండ సామెల్, మల్లన్న, మలకల్, ఏసన్న, హనుమంతు, గోకారి, గుండన్న, నారాయణ, చిన్న గంగులు, ఏలియా చిన్న ఏసన్న ఆంజనేయులు, సుధాకర్, దేవరాజు ,ఉప్పల్ కృష్ణ పాల్గొన్నారు.

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

■ ప్రజాసంఘాల డిమాండ్



**మహబూబ్‌నగర్, డిసెంబరు20 ప్రభాతవార్త:** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కార్యాలయం నుండి అమిత్ షా దిష్టిబొమ్మతో ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి అమిత్ షాదిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అమిత్ షా ను సస్పెండ్ చేయాలని, రాజ్యాంగాన్ని కాపాడాలని ,అమిత్ షా డౌన్ డౌన్, మోడీ డౌన్ డౌన్ నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించిసిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాలమోహన్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆది విష్ణు వర్ధన్‌లు మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా మంగళవారం అంబేద్కర్‌ను అవమానపరుస్తూ, హేళన చేస్తూ, కించపరుస్తూ అమిత్‌షా మాట్లాడినమాటలు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, దేశ ప్రజలను అవమానపరచ్చడం దారుణం అన్నారు. తక్షణమే మంత్రివర్గం నుండిబర్తరపు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పై ప్రమాణం చేసి అంబేద్కర్‌ను అవమానించడం అంబేద్కర్ భావజాలాన్ని కించపరుస్తూ మాట్లాడము దేశ ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. మోడీ, అమిత్ షాల వైఖరిని ప్రజాతంత్ర వాదులు ,లౌకిక శక్తులు, ప్రజలు తీవ్రంగా ఖండించాలని వారు విజ్ఞప్తి చేశారు. దేశభక్తి ముసుగులో రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి తీసుకురావడానికివారు ప్రయత్నిస్తున్నారని దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ప్రజలకువారు పిలుపునిచ్చారు. ఇందులో సిఐటియు జిల్లా కోశాధికారి బి చంద్రకాంత్, టౌన్ కన్వీనర్ జి రాజ్ కుమార్ ,ఆవాజ్ నాయకులుజాంగిర్, సిఐటియు నాయకులు గలెన్న, కెవిపిఎస్ నాయకులు మనోహర్ ,సురేష్ విజయ్ కుమార్, ఆంజనేయులు, శివకుమార్, విజయకుమార్, భాస్కర్, శ్రీనివాసులు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు ప్రభుత్వ పథకాలలో చోటు కల్పించాలి



ఆర్యవైశ్య సంఘం నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు20 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు ప్రభుత్వ పథకాలలో చోటు కల్పించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు సంభూ వెంకటరమణ కోరారు. రాష్ట్ర నాయకులు మిడిదొడ్డి శ్యాంసుందర్ నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బచ్చు రామకృష్ణ శుక్రవారం శ్రీశైల మల్లికార్జునస్వామి దర్శనానంతరం మన్ననూర్ గ్రామ ఆర్యవైశ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంభు వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి సబ్సిడీ పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టి దానిలో బీద ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించాలనికోరాడు. గత ప్రభుత్వాలు ఆర్యవైశ్యులను 10 సంవత్సరాలు వాడుకొని కొంతమంది ఆర్యవైశ్యుల పెద్దలకు కొన్ని పదవులు ఇచ్చి మభ్యపెట్టిందని ఆర్యవైశ్యులు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్‌చేస్తూ వస్తున్నారని పేర్కొన్నాడు. ఆర్య వైశ్యుల పెద్ద కులమని అగ్రకులమని ప్రభుత్వ పథకాలు అందడం లేదని కానీ ఆర్యవైశ్యులలో కూడా నిరుపేద కుటుంబాల సంఖ్య బాగాపెరిగిందని అలాంటివారికి ఇందిరమ్మ ఇళ్లల్లో రేషన్ కార్డులు ఇవ్వడంలో పెన్షన్ ఇవ్వడంలో ప్రభుత్వం కనికరం చూపాలని తెలియజేశాడు. శ్రీశైలంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైశ్యసత్రాలే ఉన్నాయని తెలంగాణ నుండి మల్లికార్జున సత్రం ఏర్పాటు చేసి ఈ సత్రానికి తెలంగాణ ఆర్యవైశ్యులు ఇబ్బందులు పడకుండా రూములు ఇస్తామని శ్యాంసుందర్ గారు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్వామి అండదండలతో అమ్రాబాద్ మండలంలో బీద ఆర్యవైశ్యులందరికీ సహాయం అందిస్తున్నారని ముఖ్యంగా ఇల్లులేని వారికి ఇల్లు ఇప్పించే ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ గారు ఆర్యవైశ్య కులానికి సరియైన స్థానం కల్పిస్తున్నాడని తెలియజేశాడు. ఈ సమావేశంలో సత్యనారాయణ సురేషు నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ కొండూరు వెంకటేశ్వర్లు సత్యనారాయణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘపెద్దలు పాల్గొన్నారు.

### విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచేందుకు

## ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

◆ నాగర్‌కర్నూల్ డిఇఓ రమేష్ కుమార్



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

**కల్వకుర్తి, డిసెంబరు19 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల కేంద్రాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని, తర్నికల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న భోజనం, వంట సరుకులు, కూరగాయలు తనిఖీ చేసి శుచి, శుభ్రత తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలు, వంట గది, స్టోర్‌రూమ్, తరగతి గదుల్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థులు నిద్రించే గదులు, టాయిలెట్లు, వంటశాలల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, శుద్ధి చేసిన నీటిని అందించాలని సూచించారు. విద్యార్థులసామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలకు సమయపాలన పాటించాలని ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను డిఇఓ పరిశీలించారు డిఇఓవెంట కోఆర్డినేటర్ బరపటి వెంకటయ్య, కల్వకుర్తి మండల విద్యాధికారి శంకర్ నాయక్ ఉన్నారు.

## ఆసుపత్రిలో సెమీ క్రిస్టమస్ వేడుకలు

◆ రోగులకు మెరుగైన సేవలను అందిచాలి

◆ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శివరాం



**కల్వకుర్తి రూరల్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కల్వకుర్తి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం పేర్కొన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో డాక్టర్ శివరాం వైద్య సిబ్బందికి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అనంతరం సెమీక్రిస్టమస్ ఉత్సవాలు నిర్వహించారు. జనరల్ ట్రాన్స్ ఫార్స్‌లో భాగంగా కొత్త డాక్టర్స్, నర్సింగ్ సిబ్బంది ఫార్మసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్ కు స్వాగతం పలికారు. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మరియు పారా మెడికల్ సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తూ మనపై నమ్మకం పెట్టుకొని వచ్చే రోగులకు సరైన చికిత్స అందించే విధంగా పని చేయాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో ఎవ్వరు కూడా రోగులవద్ద డబ్బులు అడగరాదని లేనియెడలవారిపైశాఖా పరమైన కఠినచర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఆస్పత్రిలో ఏమైనా సస్యలు ఉంటే మా దృష్టికి తీసు కురావాలని సూచించారు. ఇంకో రెండు నెలల్లో నేషనల్ క్వాలిటీ టీం రాబోతున్నందున అందరూ శాఖలవారీగాసంసిద్ధంకావలసిందనిసిబ్బందికి సూచించారు.

## ర్యాంపును ఢీకొన్న బైక్ యువతి మృతి

**కల్వకుర్తి, డిసెంబరు 20 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండలం సారంబండ తండా పరిధిలో శుక్రవారం రోడ్డు పక్కన ఉన్న ర్యాంపును జంట ఢీకొని యువతి మృతి చెందిన సంఘటన చోటుచే సుకుంది. చారకొండ ఎస్సై శంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన హర్షవర్ధన్ చారి, నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పెరమోల పావని(22). హర్షవర్ధన్, పెరమోల పావని ఉదయం 10:30కు నార్కట్ పల్లి నుండి కొత్త పల్సర్ వానంతో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జడ్చర్లకు వచ్చారు. మళ్ళీ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో జడ్చర్ల నుండి నార్కెట్ పల్లికి బయలు దేరుతుండగా మార్గం మధ్యలో చారకొండ మండలం సారంబండ తండా పరిధిలో జడ్చర్ల నల్గొండ హైవేపై గల టర్నింగ్ వద్ద వాహనం అదుపుతప్పి, రోడ్డుపక్కనే ఉన్నర్యాంపునుఢీకొనడంతో పావని అక్కడిక క్కడే మృతి చెందింది. హర్షవర్ధన్‌కి స్వల్ప గాయాల య్యాయి. అనంతరం 108 అంబులెన్స్‌లో ఇద్దరిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువతి పావని మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని ఎస్‌ఐ పేర్కొన్నారు. అతివేగం, మూలమలుపు ఉండడం ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

**వెల్దండ, డిసెంబరు 20 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ ను అవమానపరిచిన కేంద్రమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై శుక్రవారం అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ అంబేద్కర్ పై అవమానకరంగా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. అదేవిధంగా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యన్నంభూపతిరెడ్డి పర్వత్‌రెడ్డి మట్టవెంకటయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, నరేష్ నారాయణ, హమీద్, రషీద్, పుల్లయ్య, శ్రీనివాస్ యాదవ్, ఎర్ర శ్రీనుముదిరాజ్, రమేష్, గోపాల్, అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో అధ్యక్షులు అనిల్ నిరంజన్, జనార్ధన్, నిరంజన్, ప్రసాద్ ప్రభాకర్ శేఖరు, శ్రీనుతో పాటు తదితరులు ఉన్నారు.

## అమిత్‌షాను వెంటనే అరెస్టు చేయాలి

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు పరుశురాములు

**కల్వకుర్తి రూరల్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోమ్ మంత్రి ఆదిత్య వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు పరశురాములు, సిఐటియు డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత ఏపీ మల్లయ్య డిమాండ్‌చేశారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని పాలమూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బాధ్యతాయుతమైనపదవిలో ఉండిరాజ్యాంగ నిర్మాత ను అవమానకరంగా మాట్లాడడం హేయమైన చర్యగా అని వారు పేర్కొన్నారు. అమిత్ షా వెంటనే పదవి న్నుచి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం దేశంలో మొత్తం విద్వేషాలను రెచ్చగొట్టి చూస్తున్నదని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఈ దేశంలో ప్రతి పౌరునికి ఉన్నదని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను అవ మానించడం అంటే రాజ్యాంగాన్ని అగౌ రవపరచడమే అని అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్రెడ్డి, మాజీమార్కెట్ చైర్మన్ బాలయ్య జంగయ్య, మల్లేష్ ,ప్రజానాట్యమండలి జగన్, టిడిపి నాయకులు తిమ్మ య్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్, డివైఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, తులసి రామ్, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు వెంకటయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రవీంద్రనాథ్, సురేష్, కొండా రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, రైతు సంఘంనాయకుడు కిషోర్ సిఐటియు నాయకులు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.




## పాలమూరు బిడ్డకు జాతీయస్థాయి గౌరవం

◆ భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తగా కొత్తూరు గ్రీష్మ రెడ్డి నియమకం

◆ హర్షం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి జిల్లా వాసులు



గ్రీష్మ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 20 ప్రభాతవార్త:** భారత వ్యవ సాయ పరిశోధన మండలి (ఐకార్) శాస్త్రవేత్తగా నియమించబడ్డ మహ బూబ్‌నగర్ బిడ్డ టీచర్స్ కాలానికి 19వ వార్డుకు చెందిన కొత్తూరు శ్రీనివాస్‌రెడ్డి మరియు ప్రసన్న దంపతుల ప్రథమ కుమార్తె డాక్టర్ కొత్తూరు గ్రీష్మరెడ్డి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) నిర్వహించిన జాతీయస్థాయి అగ్రికల్చర్ రీసెర్చ్ సర్వీసెస్ పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచి ప్లాంట్ పాథాలజీ (మొక్కల వ్యాధి అధ్యనశాస్త్రం) విభాగం శాస్త్రవేత్తగా ఎంపిక అయ్యింది. ఈ విషయాన్ని తన తండ్రి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకి తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తపరిచారు. గ్రీష్మరెడ్డి మొదటి నుంచి చదువులో ప్రతిభను చూపుతూ ఎంసెట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బి.ఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసిందని. ఆ తరువాత ఎం.ఎస్సీ మహరాష్ట్రలో పూర్తి చేసి, తదనంతరం ఐకార్ నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్ రీసెర్చ్ ఫేల్లో పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్లాంట్ పాథాలజీలో శిబీడి పూర్తి చేసి డాక్టరేట్ సాధించిందని తన తండ్రి గర్వంగా చెప్పారు. గ్రీష్మ మాట్లాడుతూ వ్యవ సాయరంగంలో ముఖ్యంగా పంటల చీడ పీడల నివారణ కొరకు శాస్త్రి యమైనా పరిశోధనలు జరిపిఅన్నదాతలని ఆదుకోవడమే తన లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా తనను ఇంతకాలం ప్రోత్సహించినా తన తల్లితండ్రులకు, తనభర్త డాక్టర్ అఖిల్ రెడ్డికి, తన సోదరి రమ్య మరియు తన మిత్రులకి ధన్యవాదాలు తెలిపింది.

## సూపర్ మెగా మార్కెట్ యార్డ్‌గా మహబూబ్‌నగర్

◆ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్‌రెడ్డి



మార్కెట్ యార్డ్‌ను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ బేకరీ అనిత మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డును సూపర్ మెగా మార్కెట్ యార్డ్‌గా రూపుదిద్దేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరీ అనిత మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలోకి హైదరాబాద్ నుండి జెడి, ఎస్ఈ, డిఈ, డిఎంఒ, ఏఈ, మార్కెట్ సెక్రటరీ, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయకుమార్ ఆఫీసు సిబ్బందితో కలిసిమార్కెట్ యార్డ్‌లోని అన్ని పరిసరాలను పరిశీలించారు. సూపర్ మెగా మార్కెట్ యార్డ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రోద్బలంతో అధికారులు సందర్శించారు. వచ్చే రోజులలో మన నియోజకవర్గంలో సూపర్ మెగా మార్కెట్ యాడ్ తయారు కావడానికి అవకాశం ఉందన్నారు.

## కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే



సర్వే చేస్తున్న దృశ్యం

**జడ్చర్ల, డిసెంబరు 20 ప్రభాతవార్త:** శాసనసభ జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదేశాల మేరకు జడ్చర్ల మున్సిపాలిటీలోని తొమ్మిదవ వార్డు రాజీవ్‌నగర్ ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ వార్డ్ ఇంచార్జ్ ఆఫీసర్ మున్సిపల్ ఇంచార్జ్ జగన్, ఆంజనేయులు వెంకటేష్, గంట వంశి, అనిల్, ఇందిరమ్మ సభ్యులు కౌన్సిలర్ చైతన్య చౌహన్, నయీమ్ ఖాన్, మైనార్టీ కోఆర్డినేటర్, శేఖర్, గంటా వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ ఆఫీసర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎదుట బీజేపీ ఎంపీల ఆందోళన

పాల్గొన్న ఎంపీ డికె అరుణ




**మహబూబ్‌నగర్, డిసెంబరు20, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఆవరణలో ఆదివాసీ మహిళ, బీజేపీ సీనియర్ ఎంపీలపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దాడిని ఖండిస్తూ బీజేపీ ఎంపీల ధర్నా నిర్వహించారు. నిరసనల్లో తెలంగాణ ఎంపీలతో కలిసి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డికె అరుణ పాల్గొన్నారు. పార్లమెంట్ ముందున్న గాంధీ విగ్రహం ముందు బీజేపీల నిరసన తెలిపారు. ఇలాంటి దాడులను భారత్ సహించదు అంటూ ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



రాష్ట్రపతి నిలయం బొల్లారంలోని శీతాకాలం విడదిలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము గారు నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల్